క్లుప్తంగా

కమ్యూనిటీహాల్‌ను పరిశీలించిన జీఎం



కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌బాబు

కారేపల్లి: కారేపల్లిలోని సుబ్బయ్యకుంట సమీపంలో సింగరేణి సంస్థ నిధులతో నిర్మిస్తున్న సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా.. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఫోన్‌లో జీఎం జాన్‌బాబుతో మాట్లాడారు. ఈ నెల ఖరులోగా కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీవీరప్రతాప్, మల్లేల నాగేశ్వరరావు, ఎండీ హనీఫ్, షఫీ, తొగర శ్రీను, హారు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు..

మధిర: యువత మత్తుకు బానిస కావొద్దని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మల్లారంలో.. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ సైదులు అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తూ.. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై యువజన సర్వేలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్‌లో నిరసన పోరాటాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల నాయకులు నరేష్, జానీ, బాషా, అబ్దుల్, అజిత్, జగదీష్, ప్రశాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దోమ ఆనంద్‌బాబు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దోమ ఆనంద్‌బాబు ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సమక్షంలో లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, చల్ల గుళ్ల నర్సింహారావు, నారాయణవరపు శ్రీనివాస్, గాదె చెన్నారావు, వెంకటప్పారెడ్డి, డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరరావు, రోజ్‌వేణు

కల్లూరు: కల్లూరు మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఖమ్మంపాటి మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పరిగడపు బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా జానపాటి రోజ్‌వేణు, కోశాధికారిగా కావేటి రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులుగా ఖమ్మంపాటి అప్పారావు, నల్లగట్ల గురవయ్య, ప్రచార కార్యదర్శిగా రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా రామ్‌ప్రసాద్, వీరభద్రం, సుమన్, కోటిరత్నం, గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్, గౌరవ సలహాదారుడిగా డేవిడ్ రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గన్నవరంలో వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గన్నవరం గ్రామంలోని బహుజన అభ్యుదయ సేవా సమితి ఆశ్రమ వృద్ధులకు ఆదివారం దాతల సహకారంతో విరాళాలు సేకరించి సంస్థ ఆదూరి మణి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పలు సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బహుజన అభ్యుదయ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం

- తేలుతున్న కంకర.. గోతులమయంగా రహదారులు
- గుంతల్లో నిలుస్తున్న నీరు..
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- పట్టించుకోని అధికారులు



దమ్ము చక్రాలతో బీటీరోడ్డుపై తిరుగుతున్న ట్రాక్టర్ (ఫైల్)

కల్లూరురూరల్: దమ్ము చక్రాల ట్రాక్టర్లతో బీటీ రోడ్లు బీటలు వారుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులు ఈ ట్రాక్టర్ల కారణంగా కంకర తేలి.. గోతులు ఏర్పడుతున్నాయి. వాటిపై వెళ్తున్న వాహనదారులు అదుపుతప్పి కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడపొద్దని ప్రభుత్వం నిబంధనలు విధించినప్పటికీ.. పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. దీంతో గ్రామీణ రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ..

మండలంలోని అన్ని గ్రామాల్లో బీటీ రోడ్లు ప్రజల రవాణా కోసం ప్రభుత్వం నిర్మించింది. కానీ కొంత మంది రైతులు దమ్ము చక్రాలతో రోడ్లపై ట్రాక్టర్లు తిప్పి ఆ రోడ్లను గుల్ల చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులు వరి మళ్లు దున్నేందుకు గాను ఇంటి వద్ద నుంచి పొలంకు వెళ్లిన తర్వాత ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు బిగించి దున్నాలి.. కానీ వారు అలా చేయకుండా ఇంటివద్దనే ట్రాక్టర్లకు బిగించుకుని రోడ్లపై తిప్పుతున్నారు. అవి ఇనుముతో తయారు చేయడం వలన చక్రాల కొనలు సన్నగా ఉండడంతో.. రహదారులన్నీ కోతకు గురవుతాయి.

తొడుగులు వేయాలి..

దమ్ము చక్రాలకు తొడుగులు వేసినట్లయితే రహదారులు కోతకు గురికావు. ఆ చక్రాలకు మందంగా ఉన్న ఒక ప్లాస్టిక్ బెల్ట్‌ను దమ్ము చక్రాల కొనలకు తొడిగినట్లయితే రహదారులకు ఎటువంటి నష్టం జరగదు. కానీ రైతులు కనీసం ఈ చిన్నపాటి ఏర్పాట్లను కూడా చేసుకోకపోవడం దారుణం. కనీసం ట్రాక్టర్లు దున్నే ప్రాంతానికి వెళ్లిన తర్వాత దమ్ము చక్రాలు బిగించినట్లయితే ఎటువంటి ఇబ్బంది ఉండదు. రైతులు ఈ రెండు జాగ్రత్తలు కూడా విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే రహదారులకు అపార నష్టం జరుగుతుంది.

రోడ్లపై తిరగొద్దు..



దమ్ము చక్రాలతో రోడ్లపై ట్రాక్టర్లు తిరిగినట్‌లైతే ఆ ట్రాక్టర్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. రైతులు వరి మడులను దున్నే సమయంలో ట్రాక్టర్లను పొలం వద్దకు వెళ్లిన తర్వాతనే దమ్ము చక్రాలు బిగించుకోవాలి. యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుంది. రహదారులు పాడవకుండా రైతులు సహకరించాలి.

– ఎస్‌కె షాకీర్, ఎస్సై, కల్లూరు

సీఎం సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి, పక్కన నాయకులు

సత్తుపల్లిటౌన్: సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను ప్రారంభించడంతో పాటు రూ.2లక్షల రుణమాఫీ చెక్కుల అందించేందుకు ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యాన వైరాలో జరిగే సభను విజయవంతం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తిచేసి గోదావరి జలాలను విడుదల చేయనుండడంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకే రాజీవ్ కెనాల్‌తో ఎక్కువ ఉపయోగం ఉంటుందని చెప్పారు. కాగా, కెనాల్ పనులు గత ప్రభుత్వ హయాంలో 90శాతం పూర్తయినా ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్, నీరజాచౌదరి, వెంకటప్పారెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, శివవేణు, గాదె చెన్నారావు, వెల్ది జగన్మోహన్‌రావు, సుజలరాణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా జనసమీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా/కారేపల్లి: వైరాలో ఈనెల 15న జరగనున్న రైతు సభకు సభకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల హాజరు కానున్న నేపథ్యాన ప్రతీ మండలం నుంచి 10 వేల మందికి తగ్గకుండా రైతులను తరలించాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచించారు. వైరాలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఐదు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ ప్రారంభోత్సవం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వైరాలో జరిగే రైతుసభలో మాట్లాడుతారని తెలిపారు. కాగా, కారేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సభకు జనాల తరలింపుపై సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు కట్ల రంగారావు, నంబూరి కనకదుర్గ, శీలం వెంకటనర్సిరెడ్డి, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, మాలోతు శకుంతల, దేవ్లానాయక్, సౌజన్య, అడ్డగోడ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పినపాక ప్రభుత్వ పాఠశాలలో అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

తల్లాడ: మండలంలోని పినపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003 సంవత్సరంలో పదో తరగతి పూర్తైన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అదే విధంగా మిట్టపల్లి పూర్వ శాంతినికేతన్ విద్యాలయంలో 1999–2003 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం మిట్టపల్లి కాకతీయ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు తిరుమలరావు, అజిత, రామక్రిష్ణ, వెంకటేశ్వర్లు, సామినేని వీరయ్య, పూర్ణచంద్రరావు, కిన్నెర ఆనందరావు, పూర్వ విద్యార్థులు కట్టా చంద్రబాబు, నందిగామ శ్రీదర్, అశోక్, శివ, నాళ్ల సమత, హారిక, భవాని పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సేవలు అభినందనీయం



జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సత్తుపల్లిటౌన్: జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్–ఏ గ్రేడ్, స్వయం ప్రతిపత్తి హోదా వచ్చేందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ బదిలీపై హైద్రాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. మాజీ ప్రిన్సిపాల్ రామచంద్రరావు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతినిలయానికి బియ్యం వితరణ



బియ్యం అందజేస్తున్న దృశ్యం

బోనకల్: మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోనకల్‌లోని మానసిక వికలాంగుల శరణాలయానికి విజయవాడకు చెందిన బొమ్మిన దుర్గామల్లేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు బొమ్మిన యుగంధర్ 2.5 క్వింటాళ్ల బియ్యాన్ని ఆదివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా శాంతినిలయం నిర్వాహకురాలు సిస్టర్ ఆల్ఫీ, సిస్టర్ బిజిలీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, సభ్యులు అన్నవరపు శ్రీనివాసరావు, సోను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో మాజీ జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎంపీటీసీలు యంగల మార్తమ్మ, కోటపర్తి హైమావతిలను బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా పనిచేసిన 5సంవత్సరాల కాలం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బందం శ్రీను, బానోత్ కొండ, పారా ప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మారణకాండను ఖండించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏన్కూరు: బంగ్లాదేశ్ దేశంలో హిందువులపై జరుగుతున్న మారణకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆదివారం ఏన్కూరు పట్టణ కేంద్రంలో హిందూ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో కొవూరు నాగేశ్వరరావు, నెల్లూరు కోటేశ్వరరావు, నవీణ్, బానోత్ నర్సింహారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి డివిజన్‌లోని గ్రామాల్లో విషజ్వరాలకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఉమర్ కోరారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమల నివారణ చర్యల కోసం బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇవ్వాలని, సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కొత్తగూడెం – సత్తుపల్లికి పాసింజర్ రైలును నడపాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



చౌడవరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుబల్లి: మండలంలోని కేడబ్ల్యూ చౌడవరంలో ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలకు.. ఎమ్మెల్యే రాగమయి జన్మదినం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు అర్వపల్లి సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఆదివాసీలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ మండల కార్యదర్శి ప్రశాంతిరెడ్డి, సాయి గోవర్ధన్, ప్రశాంత్, వంశీ, హేమంత్ , వినయ్ పాల్గొన్నారు.

పామాయిల్ రైతులకు మద్దతు ధర ఇవ్వాలి



మాట్లాడుతున్న పామాయిల్ రైతుల సంఘం నాయకులు

వైరా: పామాయిల్ గెలలు టన్నుకు రూ.20 వేలు ధర ఇచ్చి పామాయిల్ రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పామాయిల్ రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొంకెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వారు జిల్లాలోని పలు పామాయిల్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పామాయిల్ విదేశీ దిగుమతి సుంకం తగ్గింపు వల్ల పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కలుగజేసుకుని పామాయిల్ రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, పూర్ణచందర్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



సిద్ధారంలో మందా కృష్ణమాదిగ, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ, మందా కృష్ణమాదిగ చిత్రపటాలకు ఆదివారం సిద్ధారం గ్రామంలో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోళ్లమూడి శ్రీనివాసరావు, లక్ష్మణ్, రాఘవ, సాధు జానికీరాం, అశోక్, కృష్ణయ్య, ప్రవీణ్, కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కారేపల్లి: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పును ఇవ్వటంతో.. కారేపల్లి సినిమాహాల్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా.. సినిమాహాల్ సెంటర్‌లో ఉన్న ఎమ్మార్పీఎస్ గద్దె వద్ద జెండా ఎగురవేశారు. అంతకుముందు అంబేద్కర్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు ఆదెర్ల అంజయ్య, సభాధ్యక్షులు కేసగాని బాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తురుగంటి అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వర్లు, సింగరేణి మాజీ సర్పంచ్ ఆదెర్ల స్రవంతిలు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాములు, వీరస్వామి, ఉపేందర్, విజయ్, నాగరాజు, రమేష్, వేణు, రఘు, హరీష్, సన్నీ, రాజ్‌గురు, రవి, సమ్మయ్య, శ్రీను, పవన్, నాగార్జున, సాంబ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి, క్యాన్లు పంపిణీ చేస్తున్న పిచ్చయ్య

కారేపల్లి: మండలంలోని మేకలతండాలో తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తోటకూరి పిచ్చయ్య చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మండలంలోని గేటుకారేపల్లి, కారేపల్లి, రేగులగూడెం, మేకలతండా గ్రామాల్లో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశామని, ప్రజాసేవలో భాగంగా తోటకూరి ఫౌండేషన్ పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు శుద్ధజలాన్ని సేవించాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాలు మెరుగు పడాలనే ఉద్దేశ్యంతో తాము ఈ సేవాకార్యక్రమాలు చేస్తున్నట్లు, ఇకముందు సైతం మరిన్ని సేవాకార్యక్రమాలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మత్రు, బాలాజీ, శ్రీరామ్, శంకర్, లచ్చిరాం, సామేలు, కోటి, సక్రాం, బావ్‌సింగ్, సాములు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



వేంసూరు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తల్లాడలో..



పెనుబల్లిలో..

తల్లాడ/వేంసూరు/పెనుబల్లి: తల్లాడలో స్థానిక తహసీల్ సమీపంలోనున్న వాలీబాల్ కోర్టులో, వేంసూరులో, పెనుబల్లి మండల కేంద్రంలోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, రామారావు, జనార్దన్‌రెడ్డి, రమేష్, కోటిరెడ్డి, రాము, కృష్ణయ్య, కృష్ణ, కిరణ్, కాంతారావు, కృష్ణమూర్తి, నాగన్న, నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి, వెంకటప్పారెడ్డి, వెంకటేశ్వరరావు, పావని, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, చీకటి రామారావు, గూడూరు మాధవరెడ్డి, అలుగోజు చిన్నస్వామి, దొంతు మాధవరావు, పిల్లి నవజీవన్, సూరపు రెడ్డి బాబిరెడ్డి, ఎస్‌కె కరీముల్లా, మిట్టపల్లి కిరణ్, రాజబోయిన కోటేశ్వరరావు, పంది వెంకటేశ్వరావు, మాళోతు రాధా కృష్ణ, వేముల కృష్ణయ్య, పోతురాజు కిషోర్ పాల్గొన్నారు.

మాను.. ప్రాణాలేం కాను ?

- ప్రమాదకరంగా ఎండిపోయిన వృక్షాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- భయాందోళనలో ప్రయాణికులు



తల్లాడ-భద్రాద్రి కొత్తగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎండిపోయిన చెట్టు కొమ్మలు



తల్లాడ-కొత్తగూడెం రోడ్డులో రోడ్డు వైపు ఒరిగి ఉన్న ఎండిన వృక్షం

తల్లాడ: పచ్చని చెట్లను నరుకుతారు కానీ.. ప్రమాదకరంగా ఉన్న ఈ ఎండిపోయిన పెద్ద వృక్షాన్ని మాత్రం చూస్తూనే పోతుంటారు. తల్లాడ ఊరు బయట భద్రాద్రికొత్తగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఇలా రోడ్డు మీదకు కొమ్మలు వచ్చిన దురిశిన చెట్టు ఏ కారణం చేతనో ఎండిపోయింది. దానికి ఇప్పటి వరకు తొలగించలేదు. దీంతో దాని కొమ్మలు రోడ్డు మధ్యలోకి వచ్చి ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం కావటంతో పెద్ద గాలివాన వచ్చినా ఆ చెట్టు కొమ్మలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉంది. తల్లాడ-కొత్తగూడెం రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయంతో ఆ దారి నుంచి వెళ్లేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. కానీ సంబంధిత శాఖాధికారులు మాత్రం అదేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.